# విశ్వశాంతి నిలయం శ్రీ శాంతి ఆశ్రమం

కాలచక్రం తిరుగుతూనే వుంది సమస్త ప్రాణులు పుట్టుతూ గిట్టుతూనే వున్నాయి. జనన మరణ చక్రం నుండి విడుదలయ్యేందుకు ఒక్క మానవుడికే సాధ్యం. మానవ జన్మ ఎంతో దుర్లభం. మానవ జన్మ నెత్తడం ఒక గొప్పవరం. పరమాత్మయే ఆత్మకు మూలం. ఈ దేహంతో ధర్మసాధన చేసి ముక్తిని (జనన మరణ చక్రం నుండి) పొందాలి.

జన్మతో బాటు మరణం తప్పదు. మానవుడిగా జన్మించినందుకు ఈ జన్మను సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిఒక్కరూ పరమ పదానికి అర్హులే. ఆధ్యాత్మిక సాధన ద్వారా ప్రయత్నించాలి. అలా కానినాడు మనిషి జీవితం వ్యర్థమే. ప్రపంచమంతా మాయ, భ్రాంతి. దీనినే నిజమని లోకం భావిస్తుంది. యదృశ్యం, – తన్నస్యం, ప్రపంచంలో ఏది శాశ్వతం కాదు Nothing is Permanent in this World, ఈ కన్పించేదంతా ఒకనాటికి నశించిపోయేదే. బాహ్య వస్తుజాలంలో ఇరుక్కుపోకుండా జీవిత పరమార్థాన్ని సాధించాలి. అందుకోసమే జీవించాలి, సాధన చేయాలి, సాధించాలి.

**"ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ ధ్యేయం సర్వ ముముక్షిభిః"** ఓం అనే ఒకే అక్షరం బ్రహ్మపదం (మోక్షము) పొందాలనుకునే వారందరును ధ్యానము చేయదగినది.

ప్రణవానికి అదిష్ఠానం బ్రహ్మ. ప్రణవం అన్నా ఓం అన్నా ఒక్కటే. ఓంకారాన్ని అనుష్ఠించి బ్రహ్మను తెలుసుకోవాలి. చిన్న మఱ్ఱి విత్తనంలో మహావృక్షం ఇమిడి ఉన్నట్లుగా ప్రణవంలో ప్రపంచమంతా ఇమిడి ఉన్నది. ఓంకారము నుండే అండపిండ బ్రహ్మాండం ఆవిర్భవించినది. సోహం శ్వాసను పీల్చుకునేటప్పుడు 'సో' అనగా 'అది' (దివ్యత్వం, దైవత్వం) అని అర్థము. అది పరంజ్యోతికి ప్రతిరూపం 'అహం' అనగా 'నేను' నేను ఉన్నాను అని అర్థము. అది వ్యక్తంలోని అవ్యక్తమయిన దానికి ప్రతిరూపం. జీవమున్న ప్రతి మానవుడిలోను పశు పక్ష్యాదులలోను అది సమస్త ప్రాణులలోను కొనసాగుచున్నది. ప్రతిమనిషి ప్రతి శ్వాసలో తెలిసిగాని తెలియక గాని సోహం (నేను దివ్యత్వమును) ఉచ్చరిస్తున్నాడు. సోహంలోని 'సో' ను హంలోని 'హ'ను తీసేస్తే మిగిలేది ఓం. (నేను అనాదిగా ఉన్నాను) మాత్రమే మిగులుతుంది అదే బ్రహ్మతత్వం.

ఓంకారమే ఆత్మ, బ్రహ్మం. ఈ సమస్త ప్రపంచం కూడా ఓంకారమే. ఓంకార మహిమను శృతి, స్మృతులలో అసంఖ్యాకముగా చెప్పబడినది. ఓంకారమును సమస్త మంత్రములలో ఉత్తమోత్తమమైనదిగా మహర్షులు కొనియాడినారు. (పూజ్య ఓంకార స్వాములవారు 'ఓంజప', 'సోహం' అనే రెండు పుస్తకాలను మనకందించారు). ఇట్టి ఓంకారాన్నే తారకమంత్రమని స్వామి అన్నారు. ఓంకారము గురించిన ప్రమాణ శాస్త్రములెన్నో ఉన్నవి. పరబ్రహ్మ పరమాత్మను పొందుటకు ప్రణవ (ఓం) మంత్ర ధ్యానం, దాని అనుసంధానం ముఖ్యమై ఉన్నది. మిగతా మూర్తి ధ్యానములన్ని దీనిలోనే లయించి ఉండును. ఓంకారము సముద్రము వంటిది. ఇతర దేవతా ధ్యానములన్ని నదుల వంటివి. నదులన్ని సముద్రంలో లీనమగునట్లుగా ఇతర దేవతా ధ్యానములన్నీ ఓంకారములోనే లయమగును.

**గుకారశ్చాంధకారస్తు రుకార్తన్నిరోధకృత్!** 'గు' అంటే చీకటి 'రు' అంటే దానిని అడ్డగించునది.

'అజ్ఞానమనే చీకటిని తొలగించే శక్తే గురువు. హలం పట్టుకున్నా కలం పట్టుకున్నా నేర్పేవాడు ఉన్నప్పుడే మెళుకువలు తెలుస్తాయి. ఆ నేర్పించే వాడే గురువు. లౌకిక, అలౌకిక, ఆధ్యాత్మిక... ఇలా ఏ విషయంలోనైన మానవుడిని ముందుకు నడిపించడానికి గురువు తప్పనిసరిగా కావాల్సిందే.

**అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా**
**చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవేనమః**

అజ్ఞానమనే చీకటి చేత అంధులైనవారికి జ్ఞానమనే అంజనాన్ని పూసి, కన్నులు తెరిపించిన గురువుకు నమస్కారం అని దీని భావం. సద్గురువు లభించిననాడు అవివేకి కూడా వివేకి అవుతాడు. గురువు అనుగ్రహం కల్గిననాడు అజ్ఞాని కూడా జ్ఞానవంతుడవుతాడు. "నాకు అందరికంటే ఆత్మీయుడు గురువే. ఆ తర్వాతే అమ్మానాన్న. నాన్న ఇది చెయ్యి అని చెబుతాడు. అదే గురువైతే ఏది చేయగూడదో చెబుతాడు. తల్లితండ్రులు జన్మనిస్తే గురువు జన్మ విముక్తినిస్తాడు. అందుకే గురువుకే తొలి వందనం" అని స్వామి వివేకానందులవారన్నారు.

మనది భరతభూమి, వేదభూమి, కర్మభూమి, పుణ్యభూమి ఎందరో ఋషీశ్వరులు సనాతనమైన ధర్మాన్ని మనకందించారు. స్వర్గ నివాసులైన దేవతలెందరో ధర్మాన్ని రక్షించుటకు అనేక అవతారాలెత్తి మానవాళిని సంరక్షించారు. ఎందరో మహాత్ములు జన్మించి అనేక మతాలను అవతరింపజేసారు. ఇటువంటి పవిత్ర భూమిని కలియుగంలో అనేకమంది అవతార పురుషులు ఆవిర్భవించి మానవాళి దుఃఖ నివృత్తి చేసారు. 19వ శతాబ్ధపు చివర ఓం (బ్రహ్మ), సాక్షాత్తు ఆ భగవంతుడే అవ్యాజ కరుణామూర్తిగా, అవతార పురుషునిగా, గురువుగా, ఓంకార స్వామిగా జన్మించి సకల జీవుల, సమస్త మానవులలోని అశాంతిని పోగొట్టి శాంతిని నింపుటకు ప్రపంచశాంతికి తోడ్పాటు నందించుటకు, మానవుల దృష్టిని దేహము నుండి దేహభ్రాంతి నుండి దైహి (దైవము) పైన మరల్చుటకు విశ్వప్రాణులకు సేవ చేయుటకు ఆంధ్రదేశంలోని పవిత్ర గోదావరి తీరంలో జన్మించి తూర్పు కనుమలలోని తోటపల్లి కేంద్రంగా తమ దివ్య బోధనలను కార్య కలాపాలను సాగించుట సమస్త మానవాళి చేసుకున్న పుణ్యఫలము.

ప్రేమ స్వరూపుడు సద్గురువు ఓంకార స్వాములవారు ప్రాచీనాంధ్ర చారిత్రక, సాంస్కృతిక పట్టణం మరియు అష్టాదశ శక్తి పీఠాల్లో, ఒకటైన పిఠాపురంలో 21 జనవరి 1895న శ్రీమతి శ్రీ వెంకటాచలం పుణ్యదంపతులకు జన్మించారు. తల్లిదండ్రుల ద్వారా ప్రేమ, కరుణ, అనే ఆధ్యాత్మిక వారసత్వం చిన్నతనంలో సంక్రమించినది. చిన్నతనంలోనే భూతదయ, ఓర్పు, సహనాలను వంట బట్టించుకున్నారు. స్కూలులో భగవద్గీత, బైబిల్ సూక్తులు చదవడంతో రెండు మతాల సారం ఒక్కటేననే భావనా కుసుమం వికసించింది.

విశాఖలో విద్యాభ్యాసం స్నేహితుల సహచర్యం పాశ్చాత్య దుస్తులలో ఆనందం, ఆ దుస్తులను దొంగ ఎత్తుకెళ్ళడం సహచరుడు సోమయాజులు సముద్ర స్నానానికి వెళ్ళి తిరిగి రాకపోవడం అమెరికా వెళ్ళాలనే ప్రయత్నం ఆదిలోనే ఆవిరవడం సంఘటనలు ఏది అనుకున్నట్లుగా జరుగదు. ఈశ్వరేచ్ఛ ప్రకారం జరుగుతుందనే సత్యాన్ని కనుగొన్నాడు.

ఆంగ్లభాషలో మార్కులు తక్కువగా రావడం పట్టుదలతో ఆ భాషాభివృద్ధికి శ్రమకోర్చి గ్రంధాలను

చదవడం ఇంగ్లీషు నేర్చుకొని పాఠ్యాంశాలతో బాటుగా మానసిక తత్వశాస్త్ర గ్రంధాలను చదవడం ప్రత్యేకించి తిరునన్‌వేలి సైకాలజి కళాశాల ఆచార్యులైన రామస్వామిగారి గ్రంధాలు చదవడం వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపడం స్వామీజీ వ్రాసిన ప్రపంచ శాంతి ప్రార్థన అనే వ్యాసాన్ని 'అకల్ట్' అనే పత్రికలో ప్రచురించి వేరే చిన్న పుస్తకంగా 200 ప్రతులు పంపించడం చిన్నవయస్సులోనే రచయిత అయినందుకు ఆనందపడ్డారు. రామస్వామిగారు అమెరికాలోని నెవడాలో వున్న సైకిక్ కళాశాలలో 'ఆర్ట్ ఆఫ్ హీలింగ్' 4 సం॥ల కోర్సు పూర్తి చేయడానికి విద్యావేతనం ఏర్పాటు గావించారు. అమెరికా వెళ్ళాలనే ఆత్రుతతో ఉన్న సమయంలోనే స్వామి రామతీర్థ రచించిన ఆధ్యాత్మిక గ్రంధాలు చదవడం ద్వారా ప్రాపంచిక విషయాల నుండి స్వామి దృష్టి ఆధ్యాత్మిక విషయాల మీదకి మరలినది. స్వామికి రామతీర్థలాగే అమెరికా వెళ్ళి ఆధ్యాత్మిక ప్రచారం చేసి వారిలాగే సన్యాస జీవితం గడపాలనే బలమైన కోర్కె జనియించినది. ఆచార్య రామస్వామివారి సహాయంతో నేర్చుకున్న హిప్నటిజం విద్య ద్వారా అనేకమందికి జ్వరాలు, తలనొప్పులు మటుమాయం చేసేవారు. దాంతో అనేకమంది మిత్రులు అభిమాన పాత్రులైనారు. **ప్రముఖ స్వాతంత్ర విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, పార్లమెంటు సభ్యులు మరియు శ్రీశాంతి ఆశ్రమ పూర్వాధ్యక్షులు శ్రీ తెన్నేటి విశ్వనాథం గారు డా॥ ప్రసాదరావుగారు ఇంకా చాలామంది స్వామీజీతో బాటుగా విశాఖ సముద్రతీరంలో ప్రశాంత అలల సవ్వడిలో ప్రార్థనలు చేస్తుండేవారు. స్వామీజీ ప్రారంభించిన 'అకాడమీ ఆఫ్ రిలిజియన్స్'లో సభ్యులుగా చేరినారు.** వీరందరూ వెన్నెల రాత్రుల్లో అనేక విషయాలు చర్చించేవారు. వారందరూ ఆ తర్వాత భారతమాతకు సేవచేసి తరించారు.

చిన్నవయస్సులోనే ఎంతో దూరదేశమైన అమెరికా ప్రయాణం 'బెనారస్' అనే సరుకుల ఓడలో కలకత్తా నుండి ప్రారంభమైంది. **స్వామికి శ్రీ కక్కిరాల రామారావు వారి ధర్మపత్ని, శ్రీమతి రెడ్నం వెంకాయమ్మ వారి పతి సహాయ సహకారాలు, ఆశీస్సులు అమితంగా లభించాయి.** ఓడలో ప్రయాణించినన్ని దినాలు ప్రతిరోజు సూర్యోదయ, సూర్యాస్తమయాలను వీక్షిస్తూ చైతన్యరూపుడైన భగవంతునికి ప్రార్థనలతో ధన్యవాదములు అర్పించేవాడు. ఓడ ఎల్లిస్ ద్వీపంలో ఆపివేసారు. స్వామీజీకి తగినంత వయస్సు ఆర్థిక స్తోమత లేదనే నెపంతో ఇమిగ్రేషన్ వాళ్ళు అమెరికా ప్రయాణాన్ని అడ్డుకొని కొన్నిరోజుల అనంతరం లండన్ వరకు టికెట్టు తీసి మరో ఓడలో పంపించారు. అప్పుడు స్వామి స్వేచ్ఛగా ఎప్పటికైనా అమెరికా దేశంలో ప్రవేశిస్తానని ప్రతిజ్ఞ చేసాడు. అపజయం పొందినా నిరుత్సాహపడకుండా విజయం సాధించాలనే కర్తవ్యంతో ముందుకు సాగాడు. చివరికి లండన్ చేరుకొని ఆంగ్లో ఇండియన్ అసోసియేషన్ వారి సహకారం అర్థించాడు. అక్కడే బారిస్టర్ చదువుతున్న వరాహగిరి వెంకటగిరి (భారతదేశ మాజీ రాష్ట్రపతి) అనే మిత్రున్ని కలుసుకోగా చాలా విచారించి ధన సహాయం చేసినాడు. రెండు మాసాల అనంతరం అసోసియేషన్‌వారు టికెట్ కొని బరోడా అనే ఓడలో భారతదేశాన్ని పంపించారు. అసంతృప్తిని మరచిపోవడానికి దృడసంకల్పం సిద్ధించుకోవడానికి భగవద్గీతను, స్వామి రామతీర్థ సాహిత్యాలను పఠించేవారు. ఓపికున్నంతవరకు ఎవరిపైన ద్వేషం లేకుండగా విశ్వశాంతి కొరకు ప్రార్థనలు చేస్తుండేవాడు. చివరికి మద్రాసు చేరుకుని ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చారు. పేదలకు సేవ చేయాలనే సదుద్దేశ్యంతో

కలకత్తాలో హోమియో వైద్య శాస్త్రం చదవడానికి వెళ్ళారు. బంధువుల ఇంట్లో కొన్నాలుండి అద్దె ఇంటికి మారి **స్వేచ్ఛగా, నిశ్శబ్ధంగా ధ్యానం, ప్రార్ధనలు చేసుకుంటూ రామకృష్ణ, పరమహంస వున్న దక్షిణేశ్వరం వెళ్ళి ధ్యానం చేసుకుంటూ వుండేవాడు.** అలాకాలం గడుస్తుండగా మలేరియా జ్వరం బాధించసాగింది. తిరిగి ఇంటికి చేరుకోగా తండ్రిగారు మిత్రులు సంతోషించారు. స్వామీజీకి హోమియో వైద్యం చదవాలనే కోర్కె నశించింది. ప్రకృతి చికిత్సలతో మలేరియాను నివారించుకొన్నాడు.

చంచలమైన జగత్తు నుండి అచల పరబ్రహ్మ తత్వాన్ని తెలుసుకోవడం జీవిత ధ్యేయంగా మార్చుకొని ప్రశాంతంగా జీవిస్తుండగా అంతర్వాణి త్యాగం చేయి హిమాలయాలకు వెళ్ళి సన్యసించి తపస్సు చేసి ముక్తిని పొంది దూతవుకమ్మని ప్రేరేపించింది. విశాఖ సముద్రతీరంలో ప్రశాంత రాత్రుల్లో ధ్యానాలు చేస్తు ఒకానొక రాత్రి అష్టావక్రగీత, భగవద్గీత, కమండలం మాత్రం తీసుకొని దైవం మీద భారం వేసి (బుద్ధుడి మహాభినిష్క్రమణం మాదిరిగా) బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టి 300 మైళ్ళు కాలినడకన ప్రయాణించి పూరి క్షేత్రానికి యాత్ర చేసాడు. స్వామి వందల మైళ్ళు ఒంటరిగా ప్రయాణం చేసినా సర్వదా ఆ భగవంతుడు తన వెంట నీడలా వుండి నడిపిస్తున్నాడని భావించేవాడట. అర్ధరాత్రి నడుస్తున్నప్పుడు నక్షత్రాల కాంతి ఆయన తేజస్సుగా పక్షుల కుహకుహలు ఆయన సంభోదనలుగా ఆస్వాదించేవాడు. ఈ శరీరం పూరి క్షేత్రం. ఇందులో ఉన్న ఆత్మయే ఆ జగన్నాధునిగా భావించాడు. అనుకోని పరిస్థితుల్లో ఆ దైవం ఆజ్ఞగా ఇల్లు చేరుకోవడం జరిగింది. ఆకలిదప్పుల బాధ చాలా చక్కగా అర్థమైంది. పరివ్రాజకుడిగా మారగలననే మనోధైర్యం కల్గి మరింతగా ధ్యానం చేయడం ఆరంభించారు.

హిమాలయాలకు వెళ్ళి సన్యాసం తీసుకోవాలనే కోరికకు శ్రీ కక్కిరాల రామారావు దంపతులు టికెట్టు కొని ఇచ్చి, తిరిగి వస్తాననే మాట మాత్రం తీసుకున్నారు. ప్రయాణంలో కలకత్తా వెళ్ళి కాళీమాతను దర్శించి వారణాసిలో విశ్వానంతా కాపాడే విశ్వేశ్వరుని దర్శించుకొని విష్ణుక్షేత్రమైన హరిద్వారం చేరుకొని చివరగా ఋషికేష్‌లోని స్వర్గాశ్రమానికి చేరుకున్నారు.

పావన గంగాతీరంలో తన పాత దుస్తులను వదలి విరాగియై కాషాయ వస్త్రాలను ధరించి జీవితంలో అనుక్షణం భగవత్ కార్యాలే చేస్తుంటానని ప్రమాణం చేసి స్వామి రామతీర్థ ద్వారా ప్రేరణ పొందిన ఓంకారాన్ని జపిస్తూ గంగామాత ఒడిలో గొప్ప తపస్సు చేసారు. స్వామీజీ ఓంకార ఉచ్చరణను గమనించిన సాధుసంతలు **'ఓంస్వామి'** అని **'ఓంకారస్వామి'** అని పిలవడం ఆరంభించారు. క్రీ॥పూ॥ 6వ శతాబ్ధంలో సిద్ధార్థుడు ప్రపంచ మానవాళి దుఃఖ నివారణకు బోది వృక్ష ఛాయలో ఏ విధంగా దైవంపైన భారం వేసి తపస్సు చేసి జ్ఞానోదయాన్ని పొంది బుద్ధుడై, జీవితాంతం తను కనుగొన్న సత్యాన్ని ప్రపంచానికి బోధించాడో అలాగే క్రీ.శ. 20వ శతాబ్ధంలో వెంకటేశ్వరరావు గంగాతీరంలో తపస్సు చేసి జ్ఞానాన్ని పొంది విశ్వమానవాళి అశాంతిని రూపుమాపుటకు ఓంకారస్వామియై చివరి శ్వాస వరకు సమస్త ప్రాణుల శాంతి సౌభాగ్యం కొరకు పాటు పడినారు.

**సృష్టి ప్రతి అణువునా ధ్వనించేది ఓంకారమే. ఓంకారమే సమస్త ప్రాణులలో నిండి వుంది. సర్వమంత్రాలు ఓంకారములోనే ఇమిడి ఉన్నాయి. జాతి, కుల, మత ప్రాంతీయ బేధములు లేకుండ**

**ఓంకార జపం వలన విశ్వమంతా రక్షింపబడుతుందని స్వామీజీ బోధించారు. ఓంకార జపమే మానవునికి ముక్తినందిస్తుంది. శాంతి ప్రసాదిస్తుంది.**

ఆంధ్రదేశంలోని కక్కిరాల రామారావు రత్నమ్మ దంపతులు టిక్కెట్టు డబ్బు పంపి ఒక్కసారి వచ్చి చూసి వెళ్ళమని కోరినందున స్వాములవారు పిఠాపురం చేరుకోగా మిత్రులు, బంధువులు ఎంతో సంతోషించారు అనేకులు మంత్రదీక్షలు స్వీకరించారు. కొద్దిరోజుల్లోనే ఋషీకేష్ స్వర్గాశ్రమం నుండి హిమవన్నగాలు, గంగామాత నీ రాక కొరకు ఎదురు చూస్తున్నవని పిలుపురాగా తిరిగి హిమాలయాలకు ప్రయాణమై వెళ్ళారు.

హిమవన్నగ శిఖరాల్ని చూస్తూ గంగాతరంగాల ఓంకార నాదామృతాన్ని ఆలకిస్తూ స్వర్గాశ్రమంలోను, బ్రహ్మపురిలోను కఠిన తపస్సు చేస్తూ కాలినడకన మంచు పర్వతాల్లోని కేదారీశ్వరం, బదరీనాథ్, గంగోత్రి యమునోత్రిలను ఎన్నో కష్టనష్టాల కోర్చుకొని ఒక విహంగంలా ఏది వెంట తీసుకెళ్ళకుండా, ఎవ్వరినీ ఏమి ఆశించకుండా సర్వేశ్వరునిపై భారంతో సంపూర్ణయాత్ర గావించారు. విచిత్రమేమోగాని ఆహారం, వసతి, సహాయ సహకారాలన్నీ ఆ సర్వేశ్వరుడే సమకూర్చాడు. భగవంతునిపైన భారం వేస్తే ఆయనే మోస్తాడనే సంపూర్ణ విశ్వాసం వారికి కల్గినది. వసంత, శిశిరాలు మారుతూనే వున్నాయి. ఐదారేండ్లు హిమాలయాల్లో స్వామీజీ తపోధ్యాన నిష్ఠలో పరిణితి సాధించారు. కుంభమేళా జరిగింది. ఎవరో నాగసాధువులు, మహామండలాదీశ్వరులు, సాధువులు, సంతులు ఎంతో ఆర్భాటంతో వచ్చి రకరకాల మహిమల్ని చూపేవారు. ధనం కూడా బాగా ప్రోగు చేసుకొన్నారు. స్వామీజీ వారందరిని చూసి అందులో నిజమైన సాధువులెవరో ఆ దైవమే నిర్ణయించాలన్నారు. ఆంధ్రాకు తిరిగి రమ్మని కబురొచ్చింది. స్వామి బుద్ధగయ వెళ్ళి బుద్ధ భగవానుడు తపస్సు చేసిన బోధి వృక్షం క్రింద కూర్చొని ధ్యానం చేసుకొని సంతసించి మార్గమధ్యములో బంకురాలో ఉన్న తన బాల్య మిత్రునితో కొన్నిరోజులు మహదానందంగా గడిపి రాజమండ్రికి 1917లో తిరిగి వచ్చారు. మాతృశ్రీ రత్నమ్మ, రామారావు దంపతులు ఆప్యాయతలను అందజేసారు. అనేకమంది సందర్శించుకొని మంత్రదీక్షలు తీసుకున్నారు.

హిమాలయాల్లో ప్రశాంత వాతావరణానికి అలవాటు పడినందు వలన గృహస్తుల మధ్య నివసించడం స్వామీజీకి చాలా బాధగా ఉండేదట. సామర్లకోట నుండి ఒక ధనికుడైన వర్తకుడు వచ్చి ఊరిచివర నాకొక తోట వుంది. కుటీరం నిర్మించుకొని నిశ్శబ్దంగా ధ్యానం చేసుకోవచ్చని సలహా ఈయగా అక్కడికి మకాం మార్చి పాలు అపక్వాహారం తింటూ సాధన చేసుకొనేవాడు మంత్రోపదేశానికి జనాలు వచ్చేవారు. స్వామి అప్పుడప్పుడూ కుమార భీమేశ్వరస్వామిని దర్శించి ధ్యానం చేసుకునేవాడు. ఒకనాడు లక్ష్మణస్వామి అనే ఆసామి వచ్చి ఇక్కడకు 30 మైళ్ళ దూరంలో చింతలూరనే గ్రామం ఉంది. మీరక్కడ ఆశ్రమస్థాపన చెయ్యండి. అది హిమాలయాల్లాగే ఉంటుందని చెప్పాడు. ఆశ్రమ స్థాపన ఇష్టం లేదని బాధ్యతలతో బందీ కాలేనని వారి ఆలోచనను తిరస్కరించారు. భగవత్‌లీల ఎంతో చిత్రమైనది. లక్ష్మయ్య మళ్ళీ కొద్దిరోజుల తర్వాత వచ్చి మల్లిఖార్జునధార అనే కొండవాగున్నది. కొండలపైన నీరు శివలింగంపైన పడి చాలా రమ్యంగా ఉంటుంది. ఆ ప్రాంతమంతా ప్రకృతి శోభితం ఒక్కసారి వచ్చి

చూడమని ఆహ్వానించాడు. రెండెడ్ల బండిలో కొండల మధ్య, చెట్ల మధ్యన నిశ్శబ్ద వాతావరణంలో ప్రయాణించి చల్లగా హాయిగా ఉన్న ఆ ప్రాంతమంతా చూసి అక్కడే వుండాలని అనుకొని, కష్టమైనా ప్రాక్ పశ్చిమ వాసులందరికీ శాంతి కేంద్రాన్ని స్థాపించాలని నిర్ణయించుకున్నారు స్వామీజీ.

**శ్రీ యెలుగుల లక్ష్మణస్వామి** కోరికపైన స్వామీజీ చింతలూరు వచ్చి మూడు మాసములు ఆ ప్రశాంత ప్రదేశములో వుండి పూజ, ప్రార్థన, ధ్యానము చేసుకొంటూ ఒకనాడు నాకొక నిర్మలమైన ప్రదేశము కావలెనని కోరగా ప్రస్తుతము ఆశ్రమము ఉన్న ప్రాంతంలో నేటికీ ఉన్న పెద్దమామిడి చెట్టు ప్రాంతాన్ని చూపించగా నాకు ఈ ప్రాంతం చాలు. ఇక్కడే ఆశ్రమం స్థాపిస్తానని ఒక తాటిపాకను నిర్మింపజేసుకొని నివసిస్తూ మామిడి చెట్టుకు ఊయల కట్టి అందులోనే అందరికీ అందనంత ధ్యానంలో లీనమయ్యేవారు.

ఆ ప్రాంతమంతా అరణ్యం. స్వామీజీ స్వయముగా ఆయాసపడక రోజంతా శ్రమించి రాళ్ళు, రప్పలు, ముళ్ళ పొదలను త్రవ్వి తీసి బాగుచేసేడివాడు. అతని సుకుమారమైన చేతులు బొబ్బలెక్కి రక్తాలు కారినవి. నుయ్యి త్రవ్వి పూలమొక్కలను పెంచడం చేసారు. స్వామీజీ ఎంతో ధైర్యంగా ఆశ్రమ నిర్మాణానికి పూనుకున్నారు. దానికొరకు అహర్నిశలు శ్రమపడ్డారు. అనేక వ్యయప్రసాలకు ఓర్చుకొని ముందుకు సాగారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అనేకమంది అనేక సమస్యలతో స్వామివద్దకు వచ్చేవారు. వారందరినీ ఆశీర్వదించి మహామంత్ర జలాన్ని ఇచ్చి పంపించేవారు. వారి అనారోగ్యాలు, సమస్యలు అకస్మాత్తుగా మాయమయ్యేవట. స్వామీజీ నిరంతరం శ్రీరామనామ స్మరణ చేసేవారు. వారికి చింతలూరులో 50 మంది భక్తులు ఏర్పడ్డారు. వారు స్వామిని ఒక మహోత్తరమైన వ్యక్తిగా భావించే వారు. ఎందుకనగా ఎవ్వరి నుండి ఏమి ఆశించేవారు కాదు. ఏదైనా అవసరమైతే కాలినడకన రాజమండ్రి వెళ్ళి బియ్యం, పప్పులు వగైరాలు తెచ్చేవారు. ఆ రోజుల్లోనే శ్రీ శివానంద మహారాజ్ వచ్చి కొంతకాలము స్వామీజీతో వుండి వెళ్ళేవారు.

మొదటి ప్రపంచ యుద్ధం సృష్టించిన మారణహోమం ఓంకార స్వాములవారిని కదిలించినది. ప్రపంచంలోని మానవులందరూ ఒక్కటే. అందరూ దేవుని బిడ్డలే. ఈ వైషమ్యాలు ఎందుకు, ఎందుకు ఈ బాధలు! ప్రాక్ పశ్చిమాలలో శాంతిని నింపాలని ఆశ్రమానికి శ్రీ శాంతి ఆశ్రమము అని పేరెడినారు. మీకు నా అర్పణ అని స్వామీజీ వ్రాస్తూ **"ఒకే వ్యక్తి గాని, ఒకే జాతి గాని, ఒకే దేశమునకు చెందక విశ్వమానవాళి కందరకు చెంది యుండుట అనునదెంత ఆనందకరము? సూర్యుడు ఎవరికి చెందును, చూచుటకు కన్నులుండి ఆ తేజస్సును అనుభించే వారందరికి చెందుట లేదా? చంద్రుడు, నక్షత్రములు, గాలి, నీరు ఎవరి హక్కు? ఈ ఆకాశమెవరిది? ఇవి అందరివి కావా?"**

ఈ భూమిని ముక్కల క్రింద విభజించి ఇది నాది, ఇది మీది అని స్వార్థపరులు పలుకుచున్నారు. మానవుడు ప్రకృతి సంపదను తన హస్తగతము చేసుకోవలెనని మాయచే తలంచుచున్నాడు. ఏదీ ఎవరి స్వంతం కాదు, ఏదీ చివరికి మనం కూడ శాశ్వతం కాదు. అశాశ్వతమైన వాటి కొరకు మారణహోమాలు వద్దు. మీరు ఎవరైనా కావచ్చును. (ఆస్తికులైనా నాస్తికులైనా) ఎక్కడివారైనా (ప్రాక్ పశ్చిమ) మాకు బేధమించుకను

లేదు. ఈ ఆశ్రమము మాకు ఎంత చెందినదో మీకు కూడా అంతే.

తపస్సుకు భగవత్ సాన్నిహిత్యానికి దూరమవుతున్నట్లుగా భావించిన స్వామీజీ హిమాలయాల సందర్శనకు వెళ్ళారు. హిమవన్నగ ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడైన స్వామీజీ అనిర్వచనీయమైన తపస్సు చేసాడు. శాంతి ఆశ్రమం మరియు అమాయక దరిద్ర నారాయణుల సేవలో విశ్వశాంతికి పాటుపడమని భగీరథీ మాత దివ్యతరంగాలను అందచేయగా ఋషీకేష్‌లోని స్వర్గాశ్రమంలోని గురుకులంలా శాంతి ఆశ్రమంలోఒక గురుకులాన్ని స్థాపించాలని స్వామీజీ అక్కడి నుండి నలుగురు విద్యార్థులను తెచ్చి గురుకులం స్థాపించారు. తానొకటి తలచిన దైవమొకటి తలచుననేలా ఆ గురుకులం ఎంతోకాలం కొనసాగక ఆ విద్యార్థులను తిరిగి స్వర్గాశ్రమానికి ఎంతో బాధపడుతూ పంపించారు.

ఆశ్రమాభివృద్ధి క్రమక్రమంగా వృద్ధి చెందుతూనే వుంది. సరియైన బాట కూడా లేని ఆశ్రమానికి ఎందరో దూరాభారమైనా వచ్చి స్వామిని సందర్శించి ఆశీస్సులు పొందుచున్నారు. రాను రాను భక్తుల తాకిడి పెరిగినది. వారికి భోజన వసతి కల్పించవలసి వచ్చినది. స్వామీజీ ఎవ్వరినీ ఏమి ఆశించేవాడు కాదు. దైవ సంకల్పమో, గురుదేవుల కృపనో అనుకున్నవన్ని సక్రమంగా నేటివరకు జరుగుతూనే వున్నాయి.

స్వామీజీకి తపస్సు చేసుకోవాలనే ఆకాంక్ష మెండు కాని ఈ ప్రాంత ప్రజల అమాయకత్వం, నిరక్షరాస్యత, పేదరికం, పెత్తందార్ల దోపిడీలు స్వామీజీ ఆలోచనలను మార్చేసాయి. మానవసేవే మాధవసేవగా భావించి అమాయకులకు ఆసరాగా జీవకారుణ్యానికి అండగా తన జీవితాన్ని మలచుకున్నాడు. ఆ ప్రాంత ప్రజలు స్వామీజీని నోరారా 'మా దేవుడు' అని పిలచేవారు. ఆశ్రమ సేవలో ఆనందంగా పాలుపంచుకునేవారు. కట్టడాల నిర్మాణంలోను, సేవలోను ఎంతో సహాయపడ్డారు.

అమెరికాలోని 'రోసిక్రుషియన్స్' అనే సంస్థవారు స్వామీజీని ఆధ్యాత్మిక ప్రచారం చేయమని అక్కడికి రమ్మని ఆహ్వానించారు. కాని ఫిలడెల్ఫియాలో నున్న **మాతృమూర్తి అయిన మరియా ఆమె భర్త రాల్ఫ్‌ఎంట్రికన్** దంపతుల ఆహ్వానంపైన స్వామీజీ కక్కిరాల దంపతుల కుమారుడైన 12 సం॥ల ఆత్మారాంతో 1923లో రెండవసారి అమెరికా వెళ్ళి ప్రపంచశాంతికి ప్రవచనాలను పశ్చిమ దేశానికి అందించినారు. శ్రీమరియ ఆశ్రమ స్థాపన జరిగినది. అనేకులు ఆశ్రమానికి సేవ చేయడానికి వచ్చారు.

ఈ అనంత విశ్వంలో అందరూ భగవంతుని బిడ్డలే. అందరి హృదిలోను శాంతి నిండి ఉండాలి. అప్పుడు మనందరం ప్రపంచశాంతికి పాటుపడవచ్చునని స్వామీజీ బోధించాడు. విశ్వంలో ఒకే దైవం, ఒకే మతం అదే మానవత్వం. మరియా భర్త రాల్ఫ్ ఇంజనీరు మరియు శిల్పి, ఆర్కిటెక్ కూడా కావటం చేత అన్ని మత చిహ్నాలను కలిపి విశ్వమత చిహ్నంగా ఒకదానిని చక్కగా చిత్రించాడు. తూర్పుపడమర దేశాలకు చెందిన అన్ని చిహ్నాలను అందులో ఉంచాడు. అదే ఇప్పుడు మన చిహ్నం. శాంతి కాములకు విశ్వమానవాళి కందరకును ఈ ఆశ్రమం హక్కై యున్నది. మీరలసినప్పుడు, విశ్రాంతి కావలసినపుడు మీరు శాంతి సుఖములు కోరుకొనునపుడు **"మీరు వచ్చి వుండుటకు ఈ ఆశ్రమము కలదు. ఇది విశ్వమానవాళికి చెందినది. మీ హృదయము పవిత్రవంతముగా నుండిన మీకు ఇచ్చట స్థానము లభించును. మీరు శాంతి కొరకు పరితపిస్తున్నారా. ఈ శాంతి నిలయాన్ని మీ అందరికి అర్పించుచున్నాను. అన్ని**

**జాతులవారికి, అన్నిమతముల వారికి ఇక్కడ స్వాగతము చెప్పబడుచున్నది. మీ అందరి కొరకు ఈ శాంతి నిలయాన్ని నిర్మించుట కొరకు దైవం నన్ను ఒక పనిముట్టుగా ఉపయోగించుకున్నందులకు ఆనందం. దీనిని మీ అందరకు అర్పించుచున్నాను"** అని స్వామీజీ పలికెను.

మొదటిసారిగా స్వామి యోగానందగారిని అమెరికాలో ఓంకార స్వామీజీ కలుసుకున్నారు. భారతదేశం వచ్చినప్పుడు విశాఖ శాంతి ఆశ్రమాన్ని వారు సందర్శించారు. పిలడెల్ఫియాలోని మరియా ఆశ్రమం నుండి న్యూయార్క్‌లోని శాంతి కేంద్రములో ఆదివారం రోజున ప్రవచనానికి వెళ్తున్న స్వామీజీ మంచుపైన జారిడి తుంటి ఎముక విరిగినది. పూర్తిగా కట్టువేసారు. వందలాది మంది భక్తులు వచ్చేవారు. స్వామి 40 రోజుల మౌన దీక్షలో ఉన్నారు. ఆ సందర్భంలోనే క్రిస్మస్ వేడుకలు కూడా ఘనంగా జరిగాయి.

ఓంకార స్వాములవారు అమెరికా నగరాల్లోని అనేక ప్రాంతాల్లో ప్రవచనాలు ఇవ్వడంతో ఎంతోమంది ఆధ్యాత్మిక భక్తులైనారు. ఆ తర్వాత వారు శ్రీ శాంతి ఆశ్రమ నిర్వహణకు సహకారాన్ని అందించారు. స్వామీజీ అమెరికా నుండి రాగానే గురుకులము, వైద్యశాల, వృద్ధాశ్రమాన్ని ప్రారంభించారు. బొబ్బిలి మహారాజు ఆశ్రమానికి భూరి విరాళం ఇచ్చారు. బొబ్బిలి సంస్థానానికి చెందిన వారసులందరు నేటివరకు మన ఆశ్రమ భక్తులుగా కొనసాగుతున్నారు.

ఆశ్రమం అభివృద్ధి పథంలో నడుస్తున్నది. **'మదర్ ఇండియా'** గ్రంథాన్ని ప్రచురించారు. ఆంగ్లంలో **PEACE**. తెలుగులో **శాంతి** పత్రికలు ప్రచురించబడ్డాయి. స్వామీజీ అమెరికా ప్రయాణం ద్వారా అనేకులు ఆధ్యాత్మిక అభిమానులైనారు. వారందరూ స్వామీజీని మళ్ళీ అమెరికాకు ఆహ్వానించారు. స్వామీజీ 3వ సారి 1928లో వెళ్ళారు. బోస్టను నుండి ఫిలడెల్ఫియా నగరంలోని మరియా ఆశ్రమానికి చేరుకొని ఆధ్యాత్మిక తరంగాలను ప్రసరింపజేసారు. స్వామీజీ వాషింగ్‌టన్‌లోని రోసిక్రుషియన్ లాడ్జిలో కూడా ఆధ్యాత్మిక ప్రవచనాలు చేసారు. అనేకమంది మంత్ర దీక్షలు తీసుకున్నారు. చర్చిల్లోను, బాహాయి సంస్థల్లోను, దివ్యజ్ఞాన సమాజాల్లోను జాతి, మత, రంగు బేధము లేకుండగా అమెరికా సోదర సోదరీమణులందరికి ఆధ్యాత్మిక సందేశాలనందించారు. భక్తులు 'శాంతి స్వామీజీ' అని పిలిచేవారట. భక్తులందరి సహకారంతో న్యూయార్క్ నగరంలో శాంతి సంస్థ స్థాపన జరిగినది. ఆ నగరంలోనే స్వామీజీ విదేశాల్లో ఉన్నప్పుడు మద్రాసు నుండి రాజేశ్వరానందస్వామి, మహాదేవన్ అనే యువకునితో కలసి శాంతి ఆశ్రమానికి వచ్చి పీస్ పత్రికను నడిపించారు.

1930 ఆగస్టులో లాస్‌ఏంజిల్స్ నగరంలో శాంతి కేంద్ర స్థాపన జరిగి స్వామీజీ 'భగవత్ సన్నిధి' అనే అంశంపైన ప్రసంగించారు. అమెరికాలోని అనేకచోట్ల పలు శాంతి కేంద్రాలు స్థాపింపబడినవి. స్వామీజీవారు సోదరి సుశీలాదేవితో కలసి 1931లో తిరిగి శాంతి ఆశ్రమానికి వచ్చారు. సోదరి సుశీల న్యూజెర్సి నగరంలో నివసించేది. స్వామీజీ ప్రసంగాలు విని ముగ్ధురాలై తోటపల్లి మాతృసంస్థకు 25 సం॥లు సేవలు అందించారు. ఆమె భారతదేశం రాగానే భారతీయురాలిగా కట్టు, బొట్టు మార్చుకొన్నారు. ఆమె వృత్తిరీత్యా నర్సు అయినందున ఆశ్రమంలోను చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు వైద్య సహాయం అందించారు. ఆమె కారుణ్యమూర్తి మూగ జంతువుల పట్ల అపారమైన అవ్యాజ్య ప్రేమను చూపించేది. అమెరికాలో ఒక కారు ప్రమాదంలో ఆమె ఆ సర్వేశ్వరునిలో లీనమైనది. ఆమె జ్ఞాపకార్థం శాంతి

ఆశ్రమ మొబైల్ యూనిట్‌కు **'సుశీల పీస్ వ్యాన్'** అని వైద్యశాలకు **'సుశీల వైద్యశాల'** అని పేరు పెట్టారు స్వామీజీ. ఆమె సజీవంగా లేకున్నా ఆమె అంతరాత్మ ఆశ్రమంలో సేవలు అందజేస్తూనే ఉన్నదని స్వామీజీ అనేవారు. అన్నిమతాల సారాంశాన్ని కలిపి విశ్వప్రార్థనను తయారుచేసారు. అది ప్రపంచంలోని వారందరు కలసి మెలసి తోబుట్టువుల్లా ఒకరినొకరు ప్రేమతో సేవించుకోమని, శాంతిని హృదయంలో నింపుకొని, గృహంలోను నింపి, విశ్వశాంతికి పాటు పడాలన్నారు.

భగవత్ కృపవలన స్వామీజీ అపారమైన కృషి వలన ముళ్ళు, రాళ్ళు తుప్పలతో వున్న అడవి ప్రదేశం ఒకటిన్నర దశాబ్ధి కాలంలోనే అందమైన పూలమొక్కలతోను ప్రార్థనా మందిరాలు, ధ్యాన కేంద్రాలతో రూపుదిద్దుకుంది. తూర్పుపడమర దేశాల్లోని భక్తిమయ హృదయుల సహాయ సహకారములతో ఆశ్రమం పురోగతి నందుకొనుచున్నది. ఆధ్యాత్మిక మహోన్నతి కల్గిన అనేకమంది సాధుసంతులు ఆశ్రమాన్ని సందర్శిస్తున్నారు.

1934 నుండి స్వామీజీ ఉపవాస దీక్షను, మౌనాన్ని ప్రారంభించారు. స్వామీజీ నన్ను నేను పవిత్రం చేసుకొనేందుకు మరియు ఆనందప్రాప్తి కొరకు ఇవి చేస్తున్నాను అనేవారు. అమెరికా నుండి వచ్చిన సోదరి సుశీల కూడా రెండువారాల కఠిన ఉపవాస దీక్షచేసి తరించారు.

స్వాములవారు యవ్వనంలో విద్యాభ్యాసం కొరకు విశాఖపట్నంలో ఉన్నప్పుడు ఎక్కువగా సముద్ర ప్రాంతంలోనే గడిపేవాడు. అక్కడి పేద జాలరుల జీవనం వారి పిల్లలు చదువులు లేకుండా 10 ఏండ్లు నిండకుండానే సముద్రంలోకి వేటకు వెళ్ళడం క్షుణ్ణంగా పరిశీలించేవాడు. ఆ సముద్రాన్ని ఆ జాలరులను గుర్తుంచుకొన్న స్వామీజీ వారిలో విద్యాగంధాన్ని, సామాజిక, ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపి వారి జీవన స్థితిగతులను మెరుగుపర్చాలనే దివ్య సంకల్పంతో 1934వ సంవత్సరంలో శాంతి ఆశ్రమం శాఖ స్థాపన గావించి జాలరి పిల్లలకు ప్రత్యేక బోధనా తరగతులను నిర్వహిస్తూ 1966లో ప్రాథమిక పాఠశాలకు ప్రభుత్వ అనుమతులను పొందారు. ఆ పుణ్యకార్యానికి శ్రీ పురుషోత్తమ పంతులుగారు సుందరమైన విలువైన స్థలాన్ని ఇచ్చాడు. స్వామీజీతో బాటుగా సోదరి సుశీల ఆ ప్రాంతానికి వచ్చి వందలాదిమంది జాలరుల అనారోగ్యాన్ని బాగుచేస్తూ తరించినది. మొదటగా చిన్నపాకలలో ప్రారంభమైన తరగతులు, రేకులషెడ్లు ఆ తదుపరి పక్కా భవనంలో అనేక తరగతులకు బోధనలు చేస్తూ ప్రస్తుతం 500 మంది బీద విద్యార్థులకు విజ్ఞానాన్ని అందిస్తున్నారు. స్వామీజీ ఆత్మీయ మిత్రుడైన శ్రీ తెన్నేటి విశ్వనాధం మరియు విద్వాన్ దివాకర్ల రామమూర్తితో బాటుగా సేవలందించిన అనేకమంది దాతలకు ఆ సర్వేశ్వరుడు శాంతి సౌభాగ్యాలను అందించాడు.

శ్రీ శాంతి ఆశ్రమం మరియు విశాఖపట్నం రాంనగర్ లయన్స్‌క్లబ్ సౌజన్యంతో 'ఓంకార లయన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఫర్ డెఫ్'ను శ్రీ వరహాలరావు గారు స్థాపించారు. వినపడని, మాటలు రాని విద్యార్థులకు ఉచిత విద్యను అందించి స్వశక్తిపైన జీవించేలా చేయడమే లక్ష్యం. 1974వ సం॥లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులైన డా॥ మర్రి చెన్నారెడ్డి గారు ప్రారంభించారు. అంచలంచెలుగా ఎదిగి 1995వ సం॥లో ఉన్నత పాఠశాలగా అభివృద్ధి చెందినది. ప్రస్తుతం 150 మంది విద్యార్థులకు

ప్రత్యేకమైన బోధనలతో విద్యతో బాటుగా విలువలు సాంస్కృతిక ఆధ్యాత్మిక నైతికతను అందిస్తున్నారు.

భక్తజనుల కోరిక మేరకు స్వామీజీ వివిధ ప్రాంతాల్లో పర్యటించి వారి ఆధ్యాత్మిక ఔన్నతి కొరకు ప్రసంగించేవారు. ధ్యానం తప్పనిసరిగా అందరూ చేయాలని బోధించేవారు. తోటపల్లి కొండల్లోని శ్రీశాంతి ఆశ్రమం జాతి, మత, కుల భేదములు లేకుండగా సత్యాన్వేషకుల కొరకు నిర్మించినదని మీరందరూ వచ్చి శాంతిని మార్గదర్శం గావించుకోవాలని అందరికీ ఇదే నా స్వాగతం అని చెప్పేవారు. భగవంతుడు ఒక్కడే అనేక రూపాల్లో వుంటాడు. మనం బ్రహ్మము, బుద్ధుడు, ఏసు, అల్లా అని పిలుచుకుంటాం. అన్ని మతాలసారం ఒక్కటే పవిత్రతను, ఏకత్వాన్ని శాంతిని పొందడమే. శ్రీ శాంతి ఆశ్రమ కార్యకలాపాలు నిరాటంకంగా సాగుతున్నందున స్వాములవారు 1937న సోదరి సుశీలతో కలసి అమెరికా ప్రయాణమై వారు మార్గమధ్యలో అనేకమంది భక్తుల కోరికతో రంగూన్‌లో ఆగి అక్కడ శాంతి ఆశ్రమ శాఖను ప్రారంభించి, ప్రార్థన, ధ్యానము, ఆత్మ సాక్షాత్కారానికి దారి తీస్తాయి. నిశ్చలంగా వుండి మీలోనే ఉన్న దివ్యత్వాన్ని, భగవత్ తత్వాన్ని తెలుసుకోమని వారికి సందేశాన్ని అందించారు.

ఫిలడెల్ఫియాలో స్వామి ప్రవచనాలు జరిగాయి. న్యూయార్క్ చేరి సోదరి సుశీల ఇంట్లో బస చేసారు. ఆ నగరంలోని సిలోన్ ఇండియా ఇన్‌లో బుద్ధ జయంతి జరిగింది. అనేకమంది పాళి, సింహళం, ఆంగ్లంలో ప్రసంగించారు. స్వామీజీ ప్రసంగిస్తూ బుద్ధ భగవానుడు "నీకు నీవు వెలుగునిచ్చే జ్యోతివి కావాలి" అని చెప్పాడు. కాని దురదృష్టవశాత్తు మనము వేరొకరికి జ్యోతి కావడానికి ప్రయత్నిస్తున్నాం. మన లోపల దివ్యంగా ప్రకాశవంతంగా తేజోవంతమైన అంతర్జ్యోతిని మరచిపోతున్నాం. ప్రపంచమంతా శాంతిని నింపుకోవాలని ప్రయత్నిస్తాం కాని మన హృదయంలో శాంతిని నింపుకోవడానికి ప్రయత్నించం. ప్రియమైన మిత్రులారా వ్యక్తి శాంతియే ప్రపంచ శాంతికి బాటలు వేస్తుంది. బుద్ధుని జయంతి సందర్భంగా మనమందరం మన హృదయాల్లో ఇప్పుడే, ఇక్కడే శాంతిని నింపుకుందాం అని అన్నారు. ప్రేమ విశ్వాసానికి సంబంధించినది. ఎన్నడూ మార్పు చెందనిది అదే సత్యం, అదే పరమాత్మ అందులో అందరం కలసి జీవిద్దాం. ఇప్పుడూ ఎప్పుడూ ఎల్లప్పుడూ. వివిధ దేశాల నుండి వచ్చిన అనేకమంది విన్నారు. స్వామీజీ ప్రసంగానికి ముగ్ధుడైన ఒక వ్యక్తి వచ్చి మీరే నిజమైన బౌద్ధులు స్వామి అని అన్నాడు. వెంటనే స్వామీజీ అంతా ఆ బుద్ధ భగవానుని అనుగ్రహం అన్నాడట.

స్వామీజీ అమెరికా నుండి తిరిగి వచ్చారు. ఆశ్రమం ఇప్పుడు అనేకమంది ధార్మికుల వలన అందమైన ఆశ్రమంగా మారినది. ముచ్చటైన కుటీరాలు, వైద్యశాల, వృద్ధాశ్రమం, గురుకులం, అందమైన వృక్షాలు అందర్నీ ఆహ్లాదపరుస్తున్నాయి. ఇంకా పటిష్ఠమైన భవనాలు అనేకం నిర్మించవలసి వున్నది.

1950లో స్వామీజీ విశాఖ శాంతి ఆశ్రమ కార్యక్రమాల్లో ఉండగా ఒకవ్యక్తి ఒక చిన్నపాపను ఎత్తుకుని వచ్చి మా పాపకు ప్రమాదవశాత్తు కాలు నలిగిపోయినది. ఆ పాపకు ఎవ్వరైన కాలు ఎముక ముక్కను దానం చేస్తే ఆపరేషన్ ద్వారా దానిని అతికిస్తే మామూలుగా నడవగల్గుతుంది. లేదా శాశ్వతంగా అంగవైకల్యం పొందుతుందని చెప్పారు. స్వామీజీ వెంటనే తనకాలి ఎముకను ఇచ్చుటకు అంగీకరించి

"కింగ్ జార్జి ఆసుపత్రి"లో అన్ని ఏర్పాట్లు చేయించి ఓంకారము ధ్యానము చేస్తూ ఎముకను ఆ బాలికకు దానం చేసినారు. అందరూ స్వామీజీని **'అపరదధీచి'** అని అన్నారు. నేడు స్వామి లేకున్నా స్వామి ఎముక నిర్మల కాలిలో ఉండడం భగవదనుగ్రహం "పరోపకారం మిదం శరీరం" దానికి ప్రతీక. ఓంకార స్వాములవారు. ఎముకను దానం చేసినందులకు స్వామీజీ ఆ క్షణాలను తనకు అపూర్వమైనవని చెప్పేవారు.

విశాఖ సముద్రతీరాన ఏర్పాటు చేసిన శాంతి ఆశ్రమ శాఖకు ఉత్తరాన కొంతదూరంలో ఒక కొండ వున్నది. 2వ ప్రపంచ యుద్ధం కాలంలో ప్రభుత్వం వారు కొన్ని కట్టడాలు కట్టారు. వాటిని 1946లో పడగొట్టదలచినపుడు వాటిని ఆపు చేయించి, ఒక శివలింగాన్ని స్థాపించి కైలాసగిరి అని నామకరణం చేశారు. ఓంకారస్వామి ఆ కొండపైననే 1951 నుండి 56 వరకు ఆరు సంవత్సరాలు మౌనదీక్షలో ఉన్నారు. అప్పుడు స్వామికి పూజ్య మాతా జ్ఞానేశ్వరీ సేవలు చేశారు. ఆ కాలంలో అనేకమంది యోగులు, మహాత్ములు, మిత్రులు, స్వామిని దర్శించుకోవడానికి వచ్చేవారు.

స్వామీజీ చిరకాల మిత్రుడు స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ తెన్నేటి విశ్వనాధం గారు అధ్యక్షులుగా తెలంగాణ పోరాట యోధుడు స్వామి రామానందతీర్థ కార్యదర్శులుగా శ్రీ శాంతి ఆశ్రమం The Mission of Peace అని ప్రభుత్వం దగ్గర ఆశ్రమం దాని శాఖలను 1953లో రిజిస్టరు చేసారు. వాటి నిర్వహణా బాధ్యతలను వారికి అప్పగించబడినందులకు స్వామీజీ మహదానందభరితుడైనాడు. వారు ఆశ్రమాభివృద్ధిలో మమేకమై సేవలు కొనసాగించినారు.

1954 వ సంవత్సరంలో శ్రీ శాంతి ఆశ్రమంలో ప్రాధమిక పాఠశాలను స్థాపించారు. 1960లో ప్రభుత్వం నుండి శాశ్వతమైన గుర్తింపు పొందినది. మొదట శ్రీ తాళ్ళ సర్వయ్యగారు ప్రధానోపాధ్యాయులుగా ఉండి ఎంతో కృషి చేసారు. ప్రస్తుతం 100 మంది విద్యార్థులు ప్రాధమిక విద్యనందుకొనుచున్నారు. ప్రస్తుత ఉపాధ్యాయులు, వార్డెను మరియు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు విద్య, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక విలువలు బోధిస్తున్నారు.

1981లో ప్రభుత్వం వారు శ్రీ శాంతి ఆశ్రమం వారు విద్యార్థులకు అందించే సదుపాయాలను గుర్తించి ఉన్నత పాఠశాలకు అనుమతినిచ్చారు. చుట్టుప్రక్కల 8 గ్రామాల విద్యార్థినీ విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల ద్వారా మంచి బోధనను అందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. శాంతి ఆశ్రమ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత వసతి, చక్కటి క్రమశిక్షణ, మంచి పౌష్ఠికాహారాన్ని మూడు పూటలా అందించుచున్నారు. భగవంతుని ఆశీస్సులతో భక్తులందరి ప్రార్థనల వలన ఓంకారస్వాములవారి షష్టిపూర్తి మహోత్సవాలు నాల్గుపదుల ఆశ్రమ చరిత్రలో అత్యంత ఘనంగా అంగరంగ వైభవంగా 10 రోజుల పాటు జరిగాయి. ఏకాహాలు, భజనలు, ప్రార్థనలు, మహాత్ముల సందేశాలు నిరంతరం జరుగుతూ వున్నాయి. దాదాపుగా 40 వేల మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని సంతృప్తిగా భోజనాలు చేసారు. ఈ సందర్భంగా నిర్వాణ మందిరం ముందు భాగాన జీవం ఉట్టిపడుతున్న నిలువెత్తు సైజులో **శ్రీకృష్ణుడు, బుద్ధుడు, ఏసుక్రీస్తు, గాంధీ మహాత్ముని** విగ్రహాలను ఆవిష్కరించారు. దేశ విదేశాల్లోని ఎందరెందరో భక్తులు విచ్చేసారు. సందేశాలను కానుకలను పంపించారు.

స్వామీజీ తన జన్మదిన సందేశాన్ని అద్భుతంగా లోకానికందించారు.

తూర్పు కనుమల్లోని తోటపల్లి కొండల్లో నున్న స్వామీజీని అవే కనుమల్లోని నీలగిరి కొండలు రారమ్మని లలిత అనే భక్తురాలి రూపంలో సందేశాన్ని పంపించాయి. చివరకు 1957 అక్టోబరులో సందర్శించారు. భగవంతుడు ఖరీదైన లక్ష్మీ కుటీరాన్ని శాంతి కేంద్ర స్థాపన కొరకు స్వామీజీకి ఇవ్వమని దసపల్లా రాణి మరియు రాజావార్కి సంకల్పం చేశారు. వారు వెంటనే ప్రపంచంలోని వారందరి హృదయాలకు శాంతిని ప్రసారం చేయుట కొరకు స్వామీజీకి తక్కువ వెలకు ఇచ్చారు. అన్ని హంగులతో ధ్యానమందిరం, గ్రంథాలయం విశ్వశాంతి చిహ్నాన్ని ఏర్పాటు చేసి 1960లో ప్రాక్ పశ్చిమ దేశస్తులకు శాంతి కిరణాలను ప్రసరింపజేయుటకు ప్రారంభించబడినది. 1980లో విశ్వశాంతి విద్యాలయ మెట్రిక్యులేషన్ స్కూల్ ప్రారంభించబడినది. ప్రస్తుతం వున్న ఉపాధ్యాయులు, సిబ్బంది పర్యవేక్షణలో తమిళనాడులోని ఆంగ్ల బోధనాభాష ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్నతమైన వాటిలో ఒకటిగా గుర్తింపబడినది. విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రగతిని పొందుచున్నారు. శ్రీ మధోంకార స్వాములవారికి ఎంతో ఇష్టమైన ప్రదేశం. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే మాసాలు అక్కడే ఆధ్యాత్మిక శిక్షణ, ప్రవచనాలు, సత్‌సంగాల నిర్వహణ నాటి నుండి నేటివరకు గ్రీష్మఋతువులో కొనసాగుచున్నాయి. స్వామీజీ నిర్యాణాన్ని పొందడానికి ముందు రోజులు అక్కడే గడిపినారు.

భగవత్ కృపవలన ఆశ్రమానికి 'పీస్‌వ్యాన్' అందులో మైకు, స్పీకరు సంచార వైద్యశాల సమకూర్చబడినది. దానికి **'సుశీల పీస్ వ్యాన్'** అని నామకరణము చేసి దాదాపుగా వెయ్యిమైళ్ళ ప్రయాణం చేసి 22 బహిరంగ సమావేశాలు 34 గృహాల్లో సత్‌సంగాలు నిర్వహించి భక్తుల హృదయాల్లో శాంతి బీజాలు నాటారు స్వామీజీ. శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ చేతలు మీదుగా 1960 నాటికి వైద్యశాల నిర్మాణము జరిగినది. సేవలు ప్రారంభించారు. 25 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోనికి వచ్చాయి. వైద్యశాలకు రాలేని రోగులకు సుశీల పీస్ వ్యాన్ ద్వారా ఆయా గ్రామాలకు వెళ్ళి వైద్యసేవలు అందించి మందులు ఇవ్వడమే గాక అందులో వచ్చిన విద్యార్థులు, సేవకులు, గ్రామస్థులకు గ్రామ పారిశుధ్యం గురించి తెల్పి వారి సహకారంతో గ్రామాన్నంతా శుభ్రపరిచేవారు. వ్యక్తిగత శుభ్రతను బోధించేవారు. ఈ సందర్భంలో డా॥ మార్కండేయగారి సేవలు తప్పక గుర్తు చేసుకోవాలి.

కీకారణ్యంగా ఉన్న ప్రాంతానికి అర్థశతాబ్దిలో రోడ్డు వేశారు. వైద్యాలయం, గురుకులం, ప్రార్థనా మందిరం, గ్రంథాలయం, ప్రింటింగ్ ప్రెస్, చివరికి బస్సు సౌకర్యం కల్గడం కూడా ఓంకారుని అవ్యాజ్య కృషి భక్తుల అపారమైన భక్తి తత్పరతలకు సంకేతం. భక్తులందరూ స్వామీజీ ఆశీస్సులు పొందడానికి అన్ని సౌకర్యాలు కల్పించబడ్డాయి. 17 ఆగష్టు 1966న మైసూరు గవర్నర్ గారైన శ్రీ వి.వి. గిరి గారు కోటగిరి శాంతి ఆశ్రమ ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించారు. ఆ సందర్భంగా స్వామి ప్రసంగిస్తూ నా హృదయం ముఖ్య అతిథిని ఆహ్వానిస్తున్నది. మనకోసము అలాగే అందరి శాంతి కోసము భగవంతునిలో జీవిస్తూ, ఇతరులకు సేవలందిద్దాం అన్నారు. శ్రీ గిరిగారు మాట్లాడుతూ 16 ఏండ్ల ప్రాయంలో లండన్‌లో పరిచయమైనారు. 50 ఏండ్లుగా అతడు చేస్తున్న అద్భుత కార్యాలు తెలుసును. ఉన్నతమైన ఆశయాలు

ఆలోచనలు. చిన్నతనంలోనే సన్యసించి వ్యక్తిశాంతికి, ప్రపంచశాంతికి అన్నిమతాల ప్రాతిపదికన చేసే సేవ గొప్పది. ఆ తదుపరి భారతదేశ ఉపరాష్ట్రపతిగా ది. 10-04-1968న మాతృ ఆశ్రమాన్ని సందర్శించారు.

**శ్రీరామానంద తీర్థ నిరంతర ప్రోత్సాహం వలన "శ్రీరామతీర్థ పీస్ ఇన్స్టిట్యూట్" లోకనాయక్ శ్రీ జయప్రకాశ్ నారాయణ వారి సతీమణి శ్రీమతి ప్రభావతి దేవి గారిచే ప్రారంభమైనది.** 1967లో ఆశ్రమానికి స్వర్ణోత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రార్థనలు, భజనలు, సత్సంగాలు, పేదలకు అన్న వస్త్రదానాలు, దక్షిణలు, బహుమతులు ఇచ్చారు. ఎన్నో భవంతుల నిర్మాణాలు జరిగి ప్రారంభమైనాయి. స్వామీజీ చాలా తక్కువగా మాట్లాడుతూ ఎక్కువగా ధ్యానం చేయాలని నిర్ణయించుకున్నారు. మతగ్రంథాల కన్నా మౌనము మహోన్నతమైనదని, నేను అందరిలో జీవించి వుండి మీకు మేలు చేయాలని కోరుకుంటున్నాని సందేశాన్ని అందించారు.

ఓంకారస్వాముల దివ్యశక్తి వలన తోటపల్లి కొండల్లో శ్రీశాంతి ఆశ్రమం (మాతృసంస్థ) 2. విశాఖపట్నంలో శాఖ 3. తమిళనాడు ఊటికి దగ్గరలోని కోటగిరిలో శాఖ 4. పిఠాపురంలో శాఖ 5. కాకినాడలో కేంద్రాలు ఏర్పడినవి. ఎందరో మహాత్ములు, పండితులు, పామరులు, అధికారులు, జిజ్ఞాసులు సందర్శించి స్వామివారి అమృత వాక్కులను విని వారి హృదయంలో శాంతిని నింపుకొనుటకు పూనుకున్నారు. ఆశ్రమం స్వామీజీ ఆశయాలకు అనుగుణంగా **సోదరి శాంతి, మాతా జ్ఞానేశ్వరి, శ్రీ తెన్నేటి విశ్వనాథం, సనకా రామారావు, శ్రీ రాజాజీ, శ్రీ నడింపల్లి తిరుపతిరాజు** గారి కార్యనిర్వహణలో హిమాలయాల్లోని ఆశ్రమాల వలె ఇక్కడ అన్ని కార్యక్రమాలు, అన్నిమతాల పండుగలు, ఉత్సవాలు, జయంతులు, వర్ధంతులు, జాతీయ పండుగలు నిత్య కార్యక్రమాలతో బాటుగా సజావుగా భక్తజనుల, దాతల అండదండలతో జరుగుతుండేవి. శ్రీ ఓంకార స్వాములవారు తన వయస్సును, ఆరోగ్యాన్ని అస్సలు లెక్క చేయకుండా నిరంతరం ప్రయాణిస్తూ అనేకమైన కార్యక్రమాల్లో పాల్గొని లోకశాంతికి పాటుపడేవారు. తన జీవిత చరిత్రలో కుమారి జ్ఞానేశ్వరి గూర్చి వ్రాస్తూ ప్రేమ, వినయము మృదువయిన స్వభావము కలది. తనగూర్చి ఎన్నడూ ఆలోచించదు. ఎల్లప్పుడు తాను ఇతరులకు ఎలా సహాయపడగలనా అని ఆలోచిస్తుంది. ఆమె బాల్యం నుండి నాపైన అపరిమితమైన ప్రేమానురాగాలను పంచి నన్ను ఎంతో ప్రభావితం చేసినది భగవంతుడే ఆమెను స్వయంగా నా శిష్యురాలిగా పంపించాడు. చాలా సందర్భాలలో ఆమెను నాకు గురువు కన్నా ఎక్కువగా భావించేవాడిని. ఆమె సంపూర్ణంగా భగవంతునికి అంకితమైపోయినదని అన్నారు.

ఈ శాంతి ఆశ్రమానికి సంతోషాన్ని కలిగించే నా మనస్సులోని కోరికను ఎప్పుడో తెలియజేశాను. నా తదనంతరము ఈ ఆశ్రమానికి అధిపతిగా ఉండి ఎంతో సమర్థవంతంగా, ఆధ్యాత్మికంగా పురోభివృద్ధి బాటలో నడిపించగలిగేది. కేవలం ఈ జ్ఞానేశ్వరి మాత్రమే. ఈమె ప్రపంచవ్యాప్తంగా ఉన్న భగవంతుని బిడ్డలకు వారసత్వ సంపదగా చెందుతుందని తెలిపారు.

పూజ్యపాదులు శాంత్యాశ్రమ వ్యవస్థాపకులు ఉత్తరాయణ పుణ్యకాలంలో 10 జూన్ 1982న

